బీజేపీ జిల్లా ఎన్నికల ప్రభారీగా వెంకటేశ్ నేత

పెద్దపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేప థ్యంలో భారతీయ జనతా పార్టీ జిల్లాలకు ఎన్నికల ప్రభా రీలను నియమించింది. అందులో భాగంగా జిల్లా ఎన్నికల ప్రభారీగా పెద్దపల్లి మాజీ ఎంపీ బొర్లకుంట వెంకటేశ్ నేతను నియ మించారు. వచ్చే గ్రామ పంచాయతీ, మం డల, జిల్లా పరిషత్, మున్సిపల్ ఎన్నికల్లో అత్యధికంగా పార్టీకి చెందిన అభ్యర్థులను గెలిపించడమే ధ్యేయంగా పని చేసేందుకు, పార్టీ నాయకులను అందరిని సమన్వయం చేసేందుకు పార్టీఎన్నికల ప్రభారీలను నియమించింది. ఈ సందర్భంగా వెంకటేశ్ నేత మాట్లాడుతూ రానున్న స్థానిక సం స్థల ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థులకు ధీటుగా పోటీనిస్తామని, ప్రస్తుతం జిల్లాలో పార్టీ బలంగా ఉందన్నారు. పార్టీ నేతలందరినీ సమన్వయం చేసి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తానని ఆయన ఆంధ్రజ్యోతికి తెలిపారు.



నేడు జిల్లా స్థాయి కార్యశాల..

పెద్దపల్లి పట్టణంలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక జిల్లా స్థాయి కార్యశాలను శనివారం 12:30 గంటలకు జరగనున్నదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిజామాబాద్ మాజీ ఎమ్మెల్యే ఎండల లక్ష్మీనారాయణ, జిల్లా ఎన్నికల ప్రభారీ మాజీఎంపీ వెంకటేశ్‌నేత, జిల్లా ఎన్నికల కన్వీనర్ చంద్రుపట్లసునీల్‌రెడ్డి హాజరు కానున్నారని ఒక ప్రకటనలతో తెలిపారు. ఈ కార్యశాలకు పార్టీ నాయకులు హాజరుకావాలని కోరారు.

- ఈ నెల 15న సుగ్లాంపల్లిలో హత్యతో అలర్ట్
- పంచాయితీలు జరిగే స్థలాల గుర్తింపు
- బహిరంగ స్థలాల్లో పంచాయితీలు జరగకుండా చర్యలు
- స్టేషన్లలో పెండింగ్ దరఖాస్తులపై ఆరా



పంచాయితీలపై పోలీసుల నజర్

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రాజీవ్ రహదారిని ఆనుకుని ఉన్న సుల్తానాబాద్ మండలం సుగ్లాంపల్లి వద్ద బహిరంగ ప్రదేశంలో ఇటీవల నిర్వహించిన పంచాయితీలో జరిగిన హత్యా ఘటనతో జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఎక్కడెక్కడ పంచాయితీలు జరుగుతున్నాయో వాటిపై పోలీసులు దృష్టి సారించారు. ఓదెల మండలం తారక రామనగర్‌కు చెందిన మోటం మారయ్యకు పెద్దపల్లికి చెందిన లక్ష్మీతో 20 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. ఆరు మాసాల నుంచి దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. పలు మార్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు, పెద్ద మనుషుల మధ్య పంచాయితీలు జరిగాయి. ఈ నెల 15వ తేదీన సుగ్లాంపల్లి వద్ద జరిగిన పంచాయితీలో ఇరు వర్గాల మధ్య మాటామాటా పెరిగి వివాదానికి దారి తీసింది. కత్తులు, కర్రలతో దాడికి దిగడంతో మారయ్య సోదరుడు మోటం మల్లేశ్ (35) మృతి చెందగా, లక్ష్మి తరఫున పంచాయతీకి వచ్చిన పెద్దపల్లి మండలం రాఘవాపూర్ చెందిన గాండ్ల గణేష్ (32) మృతి చెందారు. ఈ ఘటన జిల్లాలో సంచలనం సృష్టించింది. పట్టపగలే అందరు చూస్తుండగానే కత్తులతో దాడి చేసి హత్య చేయడం భయాందోళనకు గురిచేసింది. అంతకు ముందు పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీలో పట్టపగలే వివాహేతర సంబంధంపై ఒక యువకుడు హత్యకు గురి కావడం గమనార్హం. సాధారణంగా గ్రామాలు, పట్టణాల్లో భూముల తగాదాలు, ఆస్తుల గొడవలు, భార్య భర్తల మధ్య వివాదాలు, కుటుంబాల మధ్య నెలకొన్న గొడవలు, వివాహేతర సంబంధాలు, ఆయా అంశాలకు సంబంధించి మొదట పోలీస్ స్టేషన్లకు చేరుతాయి. ఈ క్రమంలో ఇరువర్గాల నుంచి కొందరు పైరవీకారులు పోలీసులను ఆశ్రయించి 'ఇప్పుడే కేసులు వద్దు.. కూర్చుండి మాట్లాడుకుంటాం సార్' అవకాశం ఇవ్వండి చెబుతుంటారు. దీంతో వారికి పోలీసులు అవకాశం ఇస్తుంటారు. ఈ విధానం చాలా ఏళ్లుగా జరుగుతున్నది. కొన్ని వివాదాలు పోలీస్ స్టేషన్లకు చేరవు. స్థానికంగా ఇరువైపులా పెద్ద మనుషులను మాట్లాడుకుని పంచాయితీలు నిర్వహిస్తుంటారు. ఈ పంచాయితీలు రెండు, మూడు సిట్టింగులు అయితే గానీ పరిష్కారానికి నోచుకోవు. ఇరువర్గాల నుంచి డిపాజిట్లు తీసుకుని వాయిదాల మీద వాయిదాలు వేస్తుంటారు. ఈ పంచాయితీలు మార్కెట్ యార్డులు, తోటలు, బహిరంగ ప్రదేశాల్లో చెట్ల నీడన జరుగు తుంటాయి. అదే వరసలో ఇటీవల సుగ్లాంపల్లి వద్ద పంచాయితీ జరిగింది. ఈ పంచాయతీ హత్యలకు దారి తీయడం దురదృష్టకరం.

(మిగతా 8వ పేజీలో)

పాఠశాలల అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి



మొట్లపల్లి పాఠశాలలో మొక్క నాటుతున్న కలెక్టర్ శ్రీహర్ష

కాల్వశ్రీరాంపూర్, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్మాణంలో ఉన్న పాఠశాలల అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన మండలంలో విస్తృతంగా పర్యటించారు. అంకంపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు, అంగన్‌వాడీ కేంద్రం, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, మడిపల్లిలోని ఎంపీపీఎస్, నిర్మాణంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాల, ఊషన్నపల్లిలోని ప్రైమరీ పాఠశాల, మొట్లపల్లి, కిష్టంపేటలో పలు ప్రభుత్వ పాఠశాలలు, మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ అంకంపల్లిలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలన్నారు. వీటికోసం అధికారులు పూర్తి స్థాయిలో సహకరించాలని, ఇండ్ల నిర్మాణ పురోగతి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. మడిపల్లి, ఊషన్నపల్లి గ్రామాల్లోని పాఠశాలల నిర్మాణ పనులు పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావాలని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మడిపల్లి పాఠశాలలో ప్రహరీ, గ్రౌండ్ లెవల్ పనులు చేపట్టాలన్నారు. అనంతరం మొట్లపల్లి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో కలెక్టర్ మొక్కను నాటారు. పారిశుధ్య నిర్వహణ మరింత మెరుగ్గా ఉండాలని పాఠశాలల ప్రాంగణాలు, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఎంపీడీఓ పూర్ణచందర్ రావు, ఎంపీఓ ఆరీఫ్, పంచాయతీ రాజ్ ఏఈ శ్రవణ్, ఎంఈఓ మహేష్ తదితరులు ఉన్నారు.

ఆధార్ అప్‌డేట్‌కు ప్రత్యేక శిబిరం

పెద్దపల్లి కల్చరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఆధార్ కార్డు అప్‌డేట్‌కు కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక క్యాంపు నిర్వహించనున్నట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 5 నుంచి 8వ తేదీ వరకు ఉచితంగా క్యాంపు ఏర్పాటు చేస్తున్నామని, దీనిని వినియోగించుకోవాలన్నారు. ఆధార్ కార్డులో అడ్రస్, పేరు మార్పు, వయసు, తదితర అన్ని రకాల మార్పులకు అవకాశం ఉంటుందన్నారు. 15 రోజుల వ్యవధిలో ఆధార్ కార్డుకు కావాల్సిన అన్ని డాక్యుమెంట్లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. పేరు మార్పు కోసం సబ్ రిజిస్ట్రార్ జారీ చేసిన వివాహ నమోదు సర్టిఫికెట్, బర్త్ కరెక్షన్‌కు బర్త్ సర్టిఫికెట్, 21 ఏళ్ల పైబడిన వారికి ఫొటోతో కూడిన మార్కుల మెమో, పాస్‌పోర్టు ఉండాలన్నారు.

విద్యలో రాణిస్తేనే గుర్తింపు



కళాశాలను సందర్శించిన ఇంటర్మీడియట్ విద్యాధికారి కల్పన

కోల్‌సిటీటౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): విద్యలో రాణిస్తేనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి డి.కల్పన పేర్కొన్నారు. గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలుర)ను శుక్రవారం సందర్శించారు. విద్యార్థుల నుద్దేశించి ఆమె మాట్లాడారు. లక్ష్యాలను ఏర్పరచుకొని వాటిని సాధించేందుకు సాధన చేయాలన్నారు. విద్యలో రాణిస్తేనే సమాజంలో మంచిస్థాయిలో నిలబడతారన్నారు. తల్లిదండ్రులు, గురువులు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టాలని, కలల్ని సాధించి చూపించి ఈ ప్రాంతానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. అధ్యాపకులు కళాశాలల్లో అడ్మిషన్లు పెంచాలని త్వరలో జరగబోయే మెగా పేరెంట్స్ సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులను సన్నద్ధం చేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సంజీవ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాఠశాలలు, కళాశాలల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

సుల్తానాబాద్‌లో బాలికల డిగ్రీ కళాశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

సుల్తానాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాఠశాలలు కళాశాలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని, పేద మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పిల్లలకు ఉన్నత విద్యను చేరువ చేస్తుందని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు అన్నారు. మహాత్మాజ్యోతిరావుపూలే బాలికల డిగ్రీ గురుకుల విద్యాలయాన్ని ఆయన సుల్తానాబాద్‌లో శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సుల్తానాబాద్ పట్టణంలో బాలికల డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసుకోవడం హర్షణీయమన్నారు. అన్ని వసతులతో కూడిన భవనంలో విద్యార్థినులకు మంచి బోధన అందించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. యేటా ఎన్‌రోల్‌మెంట్స్‌ను పెంచుకోవాలని, వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈ ప్రాంతం నుంచి 300 సీట్లు భర్తీ అయ్యే విధంగా చూస్తే అన్ని సదుపాయాలతో సొంత భవనాన్ని నిర్మించేందుకు అవసరమైన నిధులు సమకూరుస్తానని హామీ ఇచ్చారు. కళాశాలలో విద్యార్థినుల సౌకర్యార్థం గీజర్లను ఏర్పాటు చేయిస్తానన్నారు. ఇంకా ఎలాంటి సౌకర్యాలు కావాలన్నా తనకు తెలుపాలన్నారు. బాలికలు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అడిషనల్ కలెక్టర్ దాసరి వేణు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్ ప్రకాశ్ రావు, సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, ఆర్‌డీఓ గంగయ్య, ఎంపీజే ఆర్‌సీఓ అంజలి, ప్రిన్సిపాల్ వనజ, తహసీల్దార్ బషీరొద్దీన్, ఎంపీడీఓ దివ్యదర్శన్ రావు, మున్సిపల్ కమిషనర్ రమేష్, నాయకులు గాజుల రాజమల్లు, బిరుదు సమత, పన్నాల రాములు, దుగ్యాల సంతోష్ రావు, దామోదర్ రావు, శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.



బాలికల డిగ్రీ కళాశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

అప్రూవల్ రాదు.. పర్మిషన్ లేదు....

- ఓ వెంచర్‌లో అడ్డగోలుగా ఇండ్ల నిర్మాణాలు
- చోద్యం చూస్తున్న అధికారులు
- ఒకే మీటర్‌తో అన్ని ఇళ్ళకు కనెక్షన్

8

ఖని జనరల్ ఆసుపత్రిలో రోగుల క్యూ

కళ్యాణ్‌నగర్, జూలై 18(ఆంధ్రజ్యోతి): వర్షాకాల సీజన్ ప్రారంభం కావడంతో వ్యాధులు విజృంభి స్తున్నాయి. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రోగులు క్యూ కడుతున్నారు. శుక్రవారం కొత్త, పాత బిల్డింగ్‌ల్లో వివిధ వైద్యపరీక్షల కోసం భారీగా తరలి వచ్చారు. ఎక్కువగా టైఫాయిడ్, దగ్గు, జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నారు. ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు ఓపీ విభాగాలు కిటకిటలాడుతున్నాయి. రక్త పరీక్షల నిర్ధారణ కేంద్రం వద్ద కూడా రోగులు భారీ సంఖ్యలో ఉంటున్నారు. పలు చోట్ల నీళ్ల చేరడం, దానితో దోమలు, ఈగలు వృద్ధి చెందుతుండడంతో మలేరియా, టైఫాయిడ్ వంటి విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. శుక్రవారం 1200మంది రోగులు వివిధ వైద్య చికిత్స కోసం ఖని జనరల్ ఆసుపత్రికి వచ్చారు.



భారీగా తరలివచ్చిన రోగులు, బంధువులు

కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీటౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం గోదావరిఖని సప్త గిరి కాలనీలోని మహాత్మా జ్యోతి బాపూలే బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠ శాల, కళాశాలలో ఎమ్మెల్యే మొక్క నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సప్తగిరికాలనీ గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఇక్కడ నివసిస్తున్న ప్రజలకు, విద్యార్థులు ఇబ్బందులు పడుతు న్నారని పేర్కొన్నారు. కానీ ప్రజాపాలనలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టివిక్రమార్క, శ్రీధర్‌బాబుల సహకారంతో సప్తగిరికాలనీ తోపాటు నియోజకవర్గంలో అభివృద్ధి రోడ్లు, డ్రైనేజీ చేస్తున్నామన్నారు. మానవ మనుగ డకు చెట్లు ఎంతో ముఖ్యమని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. రాష్ట్రంలో రామగుండం నియోజకవర్గాన్ని అభివృద్ధిలో మొదటిస్థానంలోకి తీసుకు రావడమే తన లక్ష్యమని, ఆ దిశగా అభివృద్ధి పనులు జరుగు తున్నాయన్నారు. అడిషనల్ కలెక్టర్, కార్పొరేషన్ ఇన్‌చార్జీ కమిషనర్ అరుణశ్రీ, మెప్మా మహిళలు, విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఖనిలో భారీ వర్షం

- పొంగిపొర్లిన నాలాలు
- నీట మునిగిన ఫైవింక్లయిన్ రోడ్డు



కళ్యాణ్‌నగర్, జూలై 18(ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో శుక్రవారం ఉరుములు, మెరుపులు, పిడుగులతో భారీ వర్షం కురిసింది. కొద్ది రోజులుగా వర్షాలు లేక పారిశ్రామిక ప్రాంతంలో జనం ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి కాగా సాయంత్రం సుమారు రెండున్నర గంటల పాటు భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని పలు రోడ్లు జలమయం కాగా ఫైవింక్లయిన్, 2ఇంక్లైన్ వద్ద ఉన్న రోడ్లు వరద నీటితో మునిగాయి. దీంతో రెండు గంటల పాటు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పట్టణంలోని ప్రధాన నాలాలు పొంగిపొర్లాయి. విఠల్‌నగర్, కళ్యాణ్ నగర్ ప్రాంతంలో కొన్ని చోట్ల వర్షం నీరు ఇండ్లలోకి చొచ్చుకువచ్చాయి. మల్లికార్జున్‌నగర్ వద్ద ఉన్న ప్రధాన నాలా పొంగిపొర్లింది.

రైతుల్లో చిగురించిన ఆశలు

పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం ఉరు ములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. వర్షాలు కురవక పోవడంతో పత్తి రైతులు దిగాలు పడ్డారు. కురిసిన వర్షానికి పత్తి రైతుల కళ్లల్లో ఆనందం చిగురించింది. చెరువులు,కుంటల కింద సాగు చేస్తున్న పొలాల్లో నీరు లేక రైతులు ఇప్పటి వరకు నాట్లు వేయలేదు. కురిసన వర్షంతో రైతులు వరినాట్లకు సిద్ధమవుతున్నారు.

ఉపాధి కూలీలకు బీమాతో భరోసా

- పథకంలో చేరితే రూ.2 లక్షల వరకు ప్రమాద బీమా
- అంగవైకల్యమైతే లక్ష

పెద్దపల్లి రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో వలసల నివారణకు అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఎంతో మందికి ఉపాధినిస్తోంది. దీంతోపాటు పనులు చేసే చోట ప్రమా దం జరిగితే వారిని ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం ప్రవేశపెట్టింది. ఇందులో చేరిన ప్రతీ ఒక్కరికి పరిహారం అందించనున్నారు. ఉపాధి హామీ పథకంలో పనిచేసే ప్రతీ ఒక్కరికి పథకం అమలయ్యే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పథకం కింద నమోదుకు 18 ఏళ్ల నుంచి 70 ఏళ్ల వయసు లోపు వారు అర్హులుగా గుర్తించనున్నారు. ఇందులో చేరిన వారికి ప్రమాదవశాత్తు మరణిం చినా, పూర్తిగా అంగవైకల్యం కలిగి వారికి రూ2 లక్షలు, పాక్షికంగా అంగ వైకల్యమైతే రూ.లక్ష పరిహారం అందిస్తారు.

మండలంలో 16వేల 131 మంది కూలీలు

పెద్దపల్లి మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లో ఉపాధిహామీ పథకం ద్వారా కూలీలు 16 వేల 131 మంది ఉన్నారు. ఈ పథకంలో ఉపాధి కూలీలందరు చేరే విధంగా ఫీల్డ్ అసిస్టెంట్‌లు, మెట్‌లకు మండల అధికారులు సూచనలు చేశారు. ఉపాధి హామీ కూలీ డబ్బులు ప్రతి ఒక్కరికి బ్యాంకులు, పోస్టాఫీస్ ద్వారా జమ అవుతున్నాయి. ఆ ఖాతాలకు అనుసంధానంగా ఈ పథకాన్ని అమలు చేసే విధంగా చర్యలు చేపడు తున్నారు. ఈ పథకంలో చేరేందుకు ఏడాదికి రూ20లు చెల్లిస్తే బీమా వర్తించనుంది.

గ్రామాల్లో అవగాహనతో కూలీలకు ఉపయోగం

పెద్దపల్లి మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లో ఉన్న ఉపాధి కూలీలకు పథకంపై అవగాహన కలిగిస్తే ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే వారికి, వారి కుటుంబాలకు ఉపయోగకరంగా ఉంటుంది. ఈ పథకంపై విస్తృతంగా ప్రచారం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కేవలం రూ.20 చెల్లిస్తే 2 లక్షల ప్రమాద బీమా అందనుంది. ప్రతీ ఒక్కరిని పథకంలో చేర్పేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

కూలీల నమోదుకు శ్రీకారం

ఉపాధి కూలీలను ప్రధాన మంత్రి సురక్షణ బీమా యోజనలో చేరేందుకు ఈ నెలాఖరు వరకు గడువు విధించారు. దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేస్తే ఏపీవోలు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్ పేర్లు నమోదు చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రక్రియ పూర్త య్యాక కూలీలతో అనుమతిస్తూ బ్యాంకు ప్రతినిధులకు దరఖా స్తులు అంద జేయనున్నారు. బ్యాంకు ఖాతాకు ఆధార్ కార్డు అనుసంధానం తప్పనిసరిగా ఉండాలి. బీమా పథకంలో పేరు నమోదు చేయిం చాక యేటా ఖాతా నుంచి రూ.20 జమ చేయాలని లేఖను అందించాలి.

బ్యాంకులు సదస్సు నిర్వహించాలి

- కల్లెపల్లి అశోక్, రాఘవపూర్ గ్రామస్థులు



ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకం కోసం బ్యాంకుల చుట్టూ తిరిగే పరిస్థితి కూలీలకు ఉండదు. బ్యాంకు వారే గ్రామంలో సదస్సులు ఏర్పాటు చేసి ఉపాధి కూలీల నుంచి దరఖాస్తులు స్వీకరించాలి. దీంతో కొంతమేర కూలీలకు ఇబ్బందులు తప్పుతాయి. అధికారులు దీనిపై ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

అవగాహన కల్పిస్తున్నాం

- కొప్పుల శ్రీనివాస్, ఎంపీడీవో , పెద్దపల్లి



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమాపై గ్రామాల్లో ఉపాధిహామీ సిబ్బంది ద్వారా ప్రచారంతోపాటు అవగాహన కల్పిస్తున్నాం. మండలం లోని 30 గ్రామాల్లో ఉన్న 16 వేల 131 మంది కూలీలకు ప్రమాద బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపడుతాం.

ఎన్టీపీసీలో గంజాయి పట్టివేత

జ్యోతినగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్‌లో గురువారం రాత్రి గంజాయిని పట్టుకున్నారు. మేడిపల్లి సెంటరులో వాహనాలు తనిఖీచేస్తున్న క్రమంలో స్కూటీపై వెళ్తున్న ఇద్దరు యువకులను ఆపారు. వాహనంలో తనిఖీ చేయడంతో 100గ్రాముల గంజాయి దొరికింది. పట్టుబడిన ఇద్దరుయువకులు పారిపోయారు. వారిలో లక్ష్మీపురం గ్రామానికి చెందిన బొల్లి అజయ్‌ను అదుపులోకి తీసుకున్నామని, ఇతర నిందితుల కోసం గాలిస్తున్నామని ఎన్టీపీసీ ఎస్‌ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు. స్కూటీతోపాటు మరో వాహనాన్ని సీజ్‌చేసినట్లు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

మున్సిపల్ నాలాలో పసికందు మృతదేహం

కోల్‌సిటీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మెడికల్‌కళాశాల సమీపంలోని రాజలక్ష్మీకాలనీ వద్ద గల మున్సిపల్ నాలాలో శుక్రవారం పసికందు మృతదేహాన్ని గుర్తించారు. స్థానికులు మున్సిపల్ కార్పొరేషన్, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని వెలికి తీశారు. కార్పొరేషన్ సిబ్బంది ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్టు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు. ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రసవం సమయంలో మృతి చెందిన పసికందును మృతదేహాన్ని డ్రైన్‌లో పడవేసి ఉంటారని అనుమానిస్తున్నారు. ఈఘటన సప్తగిరి కాలనీ, ఐబీకాలనీ ప్రాంతాల్లో చర్చనీయాంశం అయ్యింది.



జూనియర్ కాంట్రాక్టు లెక్చరర్లకు ఆర్థిక కష్టాలు

- మూడు నెలలుగా అందని వేతనాలు
- రాష్ట్రంలో 420 మంది ఇంటర్ ఒకేషనల్ కాంట్రాక్టు లెక్చరర్ల అవస్థలు

జగిత్యాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న ఒకేషనల్ కాంట్రాక్టు లెక్చరర్లు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. మూడు నెలలుగా కాంట్రాక్టు లెక్చరర్లకు వేతనాలు అందకపోవడం వల్ల కష్టాల పాలవుతున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న సుమారు 420 మంది ఒకేషనల్ కాంట్రాక్టు లెక్చరర్లు సకాలంలో వేతనాలు అందక విలవిలలాడుతున్నారు. చాలీచాలని జీతాలతో అనేక సంవత్సరాలుగా విద్యార్థులకు బోధిస్తున్న కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్లు ఏప్రిల్, మే, జూన్ నెలలకు చెందిన జీతాలు రాకపోవడంతో భార్యాపిల్లలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక శాఖ క్లియరెన్స్ రాకపోవడం వల్ల వేతనాలు అందడం లేదని వాపోతున్నారు. బీఆర్ఎస్ సర్కారు హయాంలో ఇంటర్ బోర్డు పరిధిలో దాదాపు మూడు వేల మంది కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేశారు. ఇంటర్ ఒకేషనల్ కోర్సు విభాగంలో పనిచేస్తున్న సుమారు 420 మంది కాంట్రాక్టు లెక్చరర్లు పోస్టులు మంజూరు కాకపోవడం, పలు ఇతర కారణాల వల్ల రెగ్యులర్ కాలేదు. ఒకవైపు ఉద్యోగాలు రెగ్యులర్ కాకపోవడం, మరోవైపు ఏప్రిల్ నెల నుంచి వేతనాలు అందక పోవడం వల్ల అర్థాకలితో అలమటిస్తూ అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం దృష్టిసారించి కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్ల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని కోరుతున్నారు.

పెండింగ్ వేతనాలు అందించాలి



నలువాల శ్రీనివాస్, కాంట్రాక్టు లెక్చరర్, జగిత్యాల

రాష్ట్రంలో జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ల పెండింగ్ వేతనాలు వెంటనే అందించాలి. మూడు నెలలుగా వేతనాలు అందకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. వేతనాలు ఏనెలకు ఆనెల సక్రమంగా అందించాలి. వేతనాలకు ఎప్పటికప్పుడు అందకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారుతోంది.

మూడు నెలలుగా వేతనాలు రావడం లేదు



కాసం గంగా భవాని, కాంట్రాక్టు లెక్చరర్, జగిత్యాల

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఒకేషనల్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లకు మూడు నెలలుగా వేతనాలు అందడం లేదు. ఆర్థిక శాఖ క్లియరెన్స్ లేకపోవడంతో వేతనాలు అందడం లేదంటున్నారు. చాలీ చాలనీ వేతనాలతో సంవత్సరాల తరబడి పనిచేస్తున్నాము. ప్రభుత్వం వెంటనే పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి.

కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలి

- ఈ నెల 21న టెక్స్‌టైల్ పార్కు బంద్
- కార్మికుల సమావేశంలో నిర్ణయం



నిరసన తెలుపుతున్న కార్మికులు

తంగళ్లపల్లి, జులై 18 (ఆంధ్రజ్యోతి): టెక్స్‌టైల్ పార్కు కార్మికులకు నష్టం చేసే విధానాలను ప్రభుత్వం మానుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. శుక్రవారం తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి టెక్స్‌టైల్‌పార్కు కార్మికుల సమావేశం యూనియన్ అధ్యక్షుడు కూచన శంకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి హాజరైన సిఐటియు జిల్లాకార్యదర్శి రమణ మాట్లడుతూ 2023 సంవత్సరం బతుకమ్మ చీరల జాబ్ పీస్ వస్త్రానికి కార్మికులకు రావాల్సిన 10శాతం యారన్ సబ్సిడీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సిరిసిల్లలో కార్మికులకు అందించిన మాదిరిగానే మీటర్‌కు 1.42 పైసలు అందించాలన్నారు. నేతన్న పొదుపు పథకం పూర్తయిన డబ్బులు కార్మికుల ఖాతాల్లో జమ చేయడంలో నిర్లక్ష్యం వహించడాన్ని తప్పుపట్టారు. కార్మికుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించక పోవడంతో జులై21న ఒకరోజు బంద్ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమీక్ష జరిపి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సదానందం, వేణు, శ్రీకాంత్, అంజనేయులు, అంబదాస్, వెంకటేశ్, మహేశ్, అశోక్, రమేష్, శ్రీనివాస్, కనకయ్య, వరప్రసాద్, గంగారాం. లక్ష్మణ్, రవి, శంకర్, ప్రభాకర్, నరహరి, సత్యనారాయణ, సంపత్, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

23న విద్యాసంస్థల బంద్

- విజయవంతం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు

గణేశ్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ అరికట్టాలని, విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలు, జూనియర్ కళాశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ప్రకటించారు. శుక్రవారం జిల్లాలోని తెలంగాణ చౌక్ వద్ద వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బంద్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేటు విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలన్నారు. ఇంటర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి రామారపు వెంకటేష్, మచ్చ రమేష్ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్, పిడిఎస్‌యూ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కుతాటి రాణా ప్రతాప్, పిడిఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు అంగడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

రాయికల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని ధర్మాజీపేట శివారులో శుక్రవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన బెక్కం సాయిలు (70) తన పొలం నుంచి ఇంటికి వస్తుండగా శుక్రవారం రాత్రి ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు విచారణ చేపట్టారు.

బాలికపై మేనమామ అత్యాచారయత్నం

- తప్పించుకున్న బాలిక
- నిందితుడిపై పోక్సో కేసు

తిమ్మాపూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఓ బాలికపై మేనమామ అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన సంపంగి ప్రేమ్ కుమార్(30) అనేవ్యక్తి తనసొంత మేనకోడలు అయిన బాలికను ఆమె ఇంటి నుంచి కరీంనగర్‌లోని కళాశాల వద్ద తన ద్విచక్ర వాహనంపై దింపుతానని చెప్పి బలవంతంగా వెంట తీసుకువెళ్లాడు. కానీ కళాశాల వద్ద బాలికను దించకుండా కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్ శివారులో ఉన్న కాకతీయ కాలువ వైపునకు తీసుకెళ్లాడు. పక్కనే ఉన్న చెట్లపొదల్లోకి బాలికను బలవంతంగా తీసుకువెళ్లి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాలిక అతడికి సహకరించకపోవడంతో బండరాయితో హత్యాయత్నానికి ప్రయత్నించాడు. ప్రతిఘటించిన బాలిక తప్పించుకొని తన తల్లిదండ్రులకు విషయం తెలియజేసింది. తల్లిదండ్రులు బాలికను తీసుకొని తిమ్మాపూర్ సీఐ సదన్‌కుమార్ వద్దకు వెళ్లి జరిగిన విషయం చెప్పారు. బాలికను భరోసాకేంద్రానికి తీసుకువెళ్లి మహిళా అధికారి సమక్షంలో స్టేట్‌మెంట్ తీసుకున్నట్లు సీఐ తెలిపారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు ప్రేమ్‌కుమార్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు, పోలీసులు తెలిపారు. నిందితుడు పరారీలో ఉన్నాడని, పట్టుకోవడానికి చర్యలు చేపట్టినట్లు సీఐ సదన్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి



దేవానందం(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో అనారోగ్యంతో ఈనెల 15న పురుగుల మందు తాగిన రైతు దేవానందం(62) మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయనకథనం మేరకు.. దేవానందం కొంత కాలంగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నాడు. వ్యవసాయపనులు చేసేందుకు ఆరోగ్యం సహకరించకపోవడంతో మనస్థాపం చెందిన దేవానందం పురుగుల మందు తాగాడు. మూడు రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతుడికి భార్య రాజమణి, కొడుకు రాకేశ్‌లు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ వివరించారు.

గుండెపోటుతో డీఎస్పీ మహేష్ మృతి

- కరీంనగర్ పోలీస్ శాఖలో విషాదం



హుజూరాబాద్‌లో భర్త మహేష్ మృతదేహంపై పడి రోదిస్తున్న ఏసీపీ మాధవి, ఇన్‌సెట్లో డీఎస్పీ మహేష్(ఫైల్)



డీఎస్పీ మహేష్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం/ హుజూరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పోలీస్‌శిక్షణా కేంద్రంలో డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న మహేష్(56) గుండెపోటుతో శుక్రవారం కన్నుమూశారు. ప్రస్తుత హుజూరాబాద్ ఏసీపీ మాధవి భర్త అయిన మహేష్ మృతిపట్ల పోలీస్‌శాఖతీవ్రదిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. హుజూరాబాద్‌లో తన భార్య ఏసీపీ మాధవి వద్ద ఉన్న మహేష్ ఒక్కసారిగా గుండెపోటుకు గురయ్యారు. వెంటనే ఆయన్ను హుజూరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆయన ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈఘటనతో ఏసీపీ మాధవితో పాటు కుటుంబసభ్యులు, పోలీస్ ఉన్నతాధికారులు తీవ్రవిషాదంలో మునిగిపోయారు. ఎస్‌ఐగా వృత్తిని ప్రారంభించిన మహేష్, సతీమణి మాధవితోకలిసి ఒకేసారి సీఐగా, ఆపై డీఎస్పీగా పదోన్నతులు పొందారు. ఫ్రెండ్లీ పోలీస్ అధికారిగా ఆయనప్రజలమన్ననలు పొందారు.

- డీఎస్పీ మహేష్ పార్థీవదేహానికి సీపీ నివాళి..

కరీంనగర్‌లోని కట్టరాంపూర్‌లో ఉన్న మహేష్ నివాసానికి చేరుకుని ఆయన పార్థివదేహంపై పూలమాలవేసి సీపీ గౌస్‌ఆలం నివాళులర్పించారు. శోకసంద్రంలో ఉన్న ఏసీపీ మాధవికి, ఆమె కుమారులకు ధైర్యం చెప్పారు. ఈసందర్భంగా మహేష్ ఆత్మకుశాంతి చేకూరాలని ప్రార్థించారు. ఆయనతోపాటు అడిషనల్ డీసీపీ(అడ్మిన్) వెంకటరమణ, కమిషనరేట్‌కు చెందిన పలువురు పోలీస్ ఉన్నతాధికారులు నివాళులర్పించారు.

పట్టుబడిన వాహనాలకు బహిరంగ వేలం

కరీంనగర్ క్రైం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో పట్టుబడిన, యజమానులు లేని (అన్‌క్లెయిమ్డ్), వదిలివేయబడిన (అబాండన్డ్) మొత్తం140 వివిధరకాల వాహనాలను బహిరంగ వేలంద్వారా విక్రయించనున్నట్లు కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వాహనాలన్నీ ప్రస్తుతం కరీంనగర్ సీటీసీలో భద్రపరచినట్లు తెలిపారు. సిటీ పోలీస్ చట్టం-1348ఎఫ్, సెక్షన్40 ప్రకారం అందిన అధికారాలతో ఈ వాహనాలను వేలం వేయనున్నట్లు తెలిపారు. ఈ వాహనాలకు సంబంధించిన పూర్తి వివరాలను వేలం బృందం సభ్యులు కరీంనగర్ ట్రాఫిక్ సీఐ పర్శ రమేష్ సెల్ నంబర్ 8712670758లో సంప్రదించి తెలు సుకోవచ్చన్నారు.

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ అధికారిక ఫేస్‌బుక్ పేజీలో కూడా వివరాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. వాహనాలపై ఏదేని అభ్యంతరం ఉన్నా, లేదా యాజమాన్య/హైపోథికేషన్ హక్కులు ఉన్నా, ఆసక్తిగల వ్యక్తులు ఆరు నెలలలోపు కరీంనగర్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నిర్ణీత గడువులోగా ఎటువంటి క్లెయిమ్‌లు రాకపోతే, వాహనాలను బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు తెలిపారు.

డీఎస్పీ మహేష్ మరణవార్త దిగ్భ్రాంతికి గురిచేసింది

- కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్

భగత్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఏసీపీ మాధవి భర్త డీఎస్పీ మహేష్ మరణవార్త దిగ్భ్రాంతికి గురిచేసిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్‌శాఖకు మహేష్ చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. మహేష్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని వేడు కుంటున్నానని తెలిపారు. భర్తను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న మాధవికి, ఆమె పిల్లలకు మనోధైర్యాన్ని కల్పించాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు.

ప్రతీ రోజు వంద కిలోమీటర్లు

- బడి మీద మక్కువతో ప్రయాణిస్తున్న విద్యార్థిని



పానేటి పద్మ

మానకొండూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బడి మీద మక్కువతో రోజూ వంద కిలోమీటర్లు ప్రయాణిస్తోంది ఓ విద్యార్థిని. వివరాలు ఇలా ఉన్నాయి. మానకొండూర్‌లోని బాలుర ఉన్నతపాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పానేటి పద్మ గత సంవత్సరం వరకు మానకొండూర్‌లో ఉంటూ విద్య నభ్యసించింది. అయితే ఆమె తల్లి దండ్రులు వృత్తిరీత్యా సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంటకు మకాం మార్చారు. మధ్యలో బడి మార్చలేని పరిస్థితి. అయితే ఇల్లంతకుంట నుంచి బస్సు సౌకర్యం లేదు. దీంతో తల్లి దండ్రులు ఆమెను వేములవాడలో ఉండే అమ్మమ్మ ఇంటిదగ్గర ఉంచారు. అక్కడి నుంచి ఆమె బస్సులో ప్రతిరోజు మానకొండూర్‌లోని బడికి వస్తోంది. ప్రతిరోజు రానుపోను వందకిలోమీటర్ల ప్రయాణం చేస్తూ పాఠశాలకు వస్తోందని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ తెలిపారు. అంతదూరం ప్రయాణం చేసినా ప్రతి రోజు అందరి కంటే ముందే పాఠశాలకు వస్తుందని ఆయన తెలిపారు.

ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఏడీ సమీక్ష

భగత్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బస్టాండ్ ఆవరణలోని సమావేశ మందిరంలో ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పగిడిమర్రి సోలమన్ శుక్రవారం కరీంనగర్ జోన్ పరిధిలోని ఐదు రీజియన్ల ఆర్ఎంలు, డిప్యూటీ ఆర్ఎంలతో సమీక్ష నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో అన్ని రీజియన్ల పనితీరు, వర్షాకాలం ప్రారంభం అయినందున తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రీజియన్ల నుంచి వివిధ పర్యాటక ప్రదేశాలకు నడుపుతున్న టూర్ ప్యాకేజీ సర్వీసులకు ప్రయాణీల నుంచి లభిస్తున్న ఆదరణ గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ రీజనల్ మేనేజర్ బి రాజు, డిప్యూటీ రీజనల్ మేనేజర్లు, పి మల్లేశం, డి వియభాను, పి మహేశ్, వివిధ రీజియన్ల ఆర్ఎంలు, డిప్యూటీ ఆర్ఎంలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఏడీ సోలమన్

రోడ్డు ప్రమాదం కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు

కరీంనగర్ క్రైం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటనలో ఒకరికి ఆరు నెలల కఠిన కారాగార శిక్ష విధిస్తూ సెకండ్ అడిషనల్ జేఎంఎఫ్‌సీ కోర్టు తీర్పు వెలువరించింది. కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ శివారులోని బైపాస్‌రోడ్‌లోని ఒక ఫంక్షన్‌హాల్ వద్ద 2016లో రోడ్డు దాటుతతున్న దెబ్బట కృష్ణమోహన్‌ను మినీవ్యాన్ ఢీకొట్టగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఈ కేసులో నిందితుడు మినీవ్యాన్ డ్రైవర్ సాధనవేని అలియాస్ తోట శంకరయ్యకు ఆరు నెలల కఠిన కారాగార శిక్ష విధిస్తూ సెకండ్ అడిషనల్ జేఎంఎఫ్‌సీ కోర్టు తీర్పు వెలువరించిందన్నారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన కోర్టు కానిస్టేబుల్ ఆర్ పరమేశ్వర్‌ను సీఐ అభినందించారు.

యువకుడి హత్య ఘటనలో ముగ్గురిపై కేసు



కిషన్‌రావుపేటలో రోదిస్తున్న కుటుంబీకులు, బంధువులు

వెల్గటూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేటకు చెందిన సల్లూరి మల్లేష్ (26) అనేయువకుడి హత్యకేసులో శుక్రవారం ముగ్గురిపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. మృతుడి తండ్రి సల్లూరి రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నైనాల రాజిరెడ్డి(రాజన్న), నైనాల మల్లారెడ్డి (మల్లేష్), కొత్తపేటకు చెందిన చింతల హరీష్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు. ఆయన కథనం ప్రకారం కిషన్‌రావుపేటకు చెందిన నైనాల రాజిరెడ్డి కూతురు విషయంలో గొడవ జరుగగా గతంలో సల్లూరి మల్లేష్‌పై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ క్రమంలో మృతుడిపై ఆగ్రహంతో యువతితండ్రి నైనాల రాజిరెడ్డి, అతడి తమ్ముడు నైనాల మల్లారెడ్డి, కొత్తపేటకుచెందిన అతడి స్నేహితుడు చింతల హరీష్‌లు పథకం ప్రకారం గురువారం కోటిలింగాల రోడ్డు వైపు పాతవైన్స్ వెనక ప్రదేశంలో కత్తితో పొడిచి హత్య చేశారు.

- భారీ బందోబస్తు మధ్య అంత్యక్రియలు

మల్లేష్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం శుక్రవారం కిషన్‌రావుపేటకు తీసుకువచ్చారు. ఈక్రమంలో గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులను మోహరించారు. పోలీసులు మృతుడి కుటుంబీకులకు నచ్చజెప్పి న్యాయం జరిగేలా చూస్తామని ఒప్పించడంతో ఎలాంటి గొడవలు లేకుండా మల్లేష్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

- మిన్నంటిన రోదనలు

కిషన్‌రావుపేటకుచెందిన సల్లూరి రాజయ్యకు నలుగురు కుమార్తెలు కాగామల్లేష్ ఒక్కడే కొడుకు. తమకు ఆసరాగా ఉంటాడనుకున్న కొడుకు మృతిచెందడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, పాల్గొన్న విద్యార్థులు

సుభాష్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గీతాభవన్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18నెలలు గడుస్తున్నా విద్యార్థులకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. విద్యార్థులకు దాదాపు రూ.8,000కోట్లకుపైగా బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. మేము అధికారంలోకి వస్తేమార్పు తీసుకువస్తాం, విద్యార్థులకు పెండింగ్ బకాయిలను విడుదల చేస్తామని చెప్పి ఇంతవరకు దాని ఊసే ఎత్తడం లేదన్నారు. విద్యాశాఖకు మంత్రిని నియమించకపోవడం సిగ్గుచేటన్నారు. విద్యార్థుల చదువు పూర్తై సర్టిఫికెట్లు కావాలని అడిగితే పూర్తి ఫీజుకడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని కళాశాలల యాజమాన్యాలు అంటున్నాయని ఆరోపించారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. అయితే బకాయిలు రాకపోవడంతో విద్యార్థులతో పాటు కళాశాలల నిర్వాహకులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. అలాగే విద్యారంగ సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రభుత్వపాఠశాలల్లో మౌళిక సదుపాయాలు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, పర్యవేక్షించడానికి 16 మండలాల్లో ఒక్క మండలానికి కూడా ఎంఈవో లేని దుస్థితి నెలకొందన్నారు. రెగ్యులర్ ఎంఈవోలను నియమించాలని డిమాండ్‌చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని లేనిపక్షంలో అసెంబ్లీనిముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఆసంపల్లి వినయ్‌సాగర్, ఎల్కటూరి ఇసాక్, సహాయకార్యదర్శులు దుర్గం భోగేశ్వర్, గట్టు ఆకాశ్, సందేశ్, రాకేశ్, అక్షయ్, సన్నీ, నాయకులు లక్ష్మన్, చక్రి, మహేశ్, రఘు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ ప్లాంట్‌లో యంత్ర సామగ్రి చోరీ

జ్యోతినగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ ప్లాంట్‌లో ఎంజీఆర్‌లో ఉన్న విలువైన యంత్ర సామగ్రి చోరీకి గురైంది. చోరీ జరిగిందని ఎన్టీపీసీ ఏజీఎం విజయ్ కుమార్ సిక్దర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు చురుగ్గా స్పందించారు. ఎస్‌ఐ ఉదయ్ కిరణ్ నేతృత్వంలో పోలీసులు కొద్ది గంటల్లోనే శుక్రవారం సామగ్రిని పట్టుకున్నారు.

మేడిపల్లి సెంటరులోని ఒక దుకాణంలో దాచిన సుమారు 2.80 లక్షల రూపాయల విలువైన క్రషర్ హ్యామర్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నింది తులైన హర్యానాకు చెందిన వకీల్, మేడి పల్లి సెంటర్‌కు చెందిన అనిల్‌ను అదుపు లోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు. అలాగే చోరీకి ఉపయోగించిన ట్రాక్టర్, ఎక్స్‌కావేటర్‌ను సీజ్‌చేశామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ద్విచక్ర వాహనాలు చోరీ

తంగళ్లపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన ప్రణయ్ తన ఇంటిముందు రాత్రి నిలిపిన ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని దుండగలు ఎత్తుకెళ్లారు. అలాగే పద్మనగర్‌కు చెందిన గాజుల మహేశ్ ద్విచక్రవాహనం రాత్రి ఇంటి ముందు పార్కుచేయగా ఉదయం చూసే సరికి వాహనం కనిపించకుండా పోయింది. ఈ సంఘటనలపై ఇద్దరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రణయ్ ఇంటి ముం దు ఉన్న సీసీకెమెరాను పరిశీలించగా ముఖానికి మాస్క్ ధరించిన ముగ్గురు యువకులు రెండు ద్విచక్రవాహనాలపై చేరుకుని ప్రణయ్‌ఇంటి ముందు వాహనం ఎత్తుకెళ్తున్న దృశ్యం రికార్డు అయ్యింది. పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుల కోసం గాలిస్తున్నారు.

ఈ నెల 25న ఖని నుంచి బీదర్‌కు ప్రత్యేక బస్సు

కళ్యాణ్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఆర్టీసీ బస్టాండ్ నుంచి కర్ణాటక రాష్ట్రంలోని బీదర్, రేజింతల్, జర సంఘంకు సూపర్ లగ్జరీ సర్వీస్‌ను ఏర్పాటు చేసినట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ నాగ భూషణం ఒక ప్రకటనలో తెలిపారు. 25న గోదావరిఖని బస్టాండ్ నుంచి తెల్లవారు జామున 3.30గంటలకు బయలు దేరి 10గంటలకు బీదర్‌కు చేరుకుంటుంది. అక్కడ స్వయంభుగా వెలసిన లక్ష్మీనర్సింహ స్వామిని ఆలయ దర్శనం అనంతరం 2 గంటలకు బీదర్ బుర్జా చేరుకుంటుంది.



అనంతరం రేజింతల్‌లో సిద్ధి వినాయక స్వామి దర్శనం అనంతరం సాయంత్రం 4 గంటలకు జరా సంఘంలోని శ్రీ కేతికి సంగమేశ్వర స్వామిని దర్శించుకుని రాత్రి 12 గంటలకు తిరిగి గోదావరిఖనికి చేరుకుంటుందన్నారు. గోదావరిఖని నుంచి పెద్దలకు రూ.1470, పెద్దపల్లి నుంచి రూ.1420, కరీంనగర్ నుంచి రూ.1370, పిల్లలకు గోదావరిఖని నుంచి రూ.1130, పెద్దపల్లి నుంచి రూ.1070, కరీంనగర్ నుంచి రూ.1030 చార్జీలను నిర్ణయించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని గోదావరిఖని, పెద్దపల్లి, కరీంనగర్ ప్రాంత ప్రజలు వినియోగించు కోవాలని కోరారు. వివరాల కోసం 7013504982, 7989847927 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

బీపాస్ స్థానంలో బిల్డ్ నౌ



- ఏఐ టెక్నాలజీతో భవన నిర్మాణాలకు అనుమతి
- ఇకపై అనుమతి తర్వాతే ఇంటి నిర్మాణం
- ఆగస్టు నుంచి అమల్లోకి

చొప్పదండి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): టీజీబీపాస్ స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా బిల్డ్ నౌ ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రవేశపెట్టింది. నాణ్యమైన, వేగవంతమైన పౌర సేవలను అందించడమే లక్ష్యంగా మున్సిపాలిటీలలో భవన నిర్మాణాలు, లే అవుట్ల అనుమతి ప్రక్రియను ఇకపై బిల్డ్ నౌ ద్వారానే పొందాల్సి ఉంటుంది. ప్రస్తుతం బీపాస్, బిల్డ్ నౌ పోర్టల్ ద్వారా భవన నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్న ప్రభుత్వం ఆగస్టు 1 నుంచి బిల్డ్ నౌ ద్వారానే అనుమతులు పొందాల్సి ఉంటుంది.

బీపాస్‌ను ఈ నెలాఖరుకు ముగిస్తున్నట్లు తెలిసింది. బిల్డ్ నౌ పూర్తిగా ఏఐ టెక్నాలజీ ఆధారిత వ్యవస్థతో పోర్టల్‌ను రూపొందించగా నిర్మాణ అనుమతి ప్రక్రియ వేగంగా పూర్తమవుతుంది. 75 గజాలలోపు నిర్మాణానికి అవసరమైన పత్రాలను అప్‌లోడ్ చేసిన వెంటనే అనుమతి పొందవచ్చునని అధికారులు చెప్తున్నారు. ఆపై విస్తీర్ణం ఉన్న స్థలాలకు, లే అవుట్లకు 15 నుంచి 21 రోజులలోపు అనుమతి లభించనుంది.

ఏఐ టెక్నాలజీతో అనుమతి

నూతనంగా ప్రవేశెట్టిన బిల్డ్ నౌ పోర్టల్ ఏఐ టెక్నాలజీతో పనిచేస్తుంది. అనుమతి కోసం దరఖాస్తు చేసిన వెంటనే సంబంధిత అధికారికి స్థలం లొకేషన్ తెలిసిపోతుంది. స్థలంలో ఎలాంటి నిర్మాణాలు ఉన్నాయో సులువుగా తెలుస్తుంది. నిమిషాల్లోపలే స్థలం పరిశీలన పూర్తవుతుంది.

గతంలో డిజైన్లు, పత్రాలు, మ్యాప్‌ల పరిశీలనకు 20 నుంచి 30 రోజుల సమ యం పట్టేది. ఇప్పుడు సూచించిన విధానంలో పత్రా లను సమర్పిస్తే



నిమిషాల్లోనే పరిశీలన పూర్తవు తుంది. అనుమతులు లేకుండా డిజైన్‌కు భిన్నంగా భవన నిర్మాణాలు చేపట్టడం, వ్యాపార అవసరాల కోసం నిర్మించే భవనాలను నివాస గృహాలుగా చూప డం వంటి వాటికి బిల్డ్ నౌ పోర్టల్ ద్వారా అడ్డుకట్ట పడే అవకాశం ఉంది. లే అవుట్ నిర్మాణ స్థలం హద్దుల అతిక్రమణకు అవకాశం ఉండదు.

అనుమతి తీసుకున్న తర్వాతే పనులు

బిల్డ్ నౌ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న నిర్మాణదారులు అనుమతి తీసుకున్న తర్వాతే భవన నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుంది. బీపాస్ విధానంలో ఇంటి నిర్మాణం చేపట్టిన తర్వాత కూడా అనుమతి లభించేది. ప్రస్తుతం బిల్డ్ నౌలో మాత్రం అనుమతి తీసుకున్న తర్వాత ఇంటి నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. దరఖాస్తుదారుడి ఇంటి స్థలంలో ఎలాంటి కట్టడాలు ఉన్నా సంబంధిత అధికారికి ఏఐ టెక్నాలజీ ద్వారా స్థల స్వభావం తెలిసిపోతుంది.
దీంతో అధికారి భవన నిర్మాణ అనుమతి నిరాకరించే అవకాశం ఉంటుంది. 2020లో తీసుకువచ్చిన టీఎస్ బీపాస్ ఈ నెల 31 వరకు మాత్రమే అందుబాటులో ఉండనుంది. టీఎస్ బీపాస్ స్థానంలో ఆగస్టు 1 నుంచి పూర్తిస్థాయిలో బిల్డ్ నౌను వినియోగంలోకి తీసుకురానున్నారు. వేగవంతమైన పౌర సేవలందించడమే లక్ష్యంగా చేపడుతున్న సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వం ఒకే రాష్ట్రం ఒకే విధానం పేరిట బిల్డ్ నౌకు శ్రీకారం చుట్టింది.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం మే/జూన్-2025లో నిర్వహించిన డిగ్రీ-2,4,6వ(సీబీసీఎస్)సెమిస్టర్స్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ (బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఎం, బీఏఎల్) సంబంధించిన పరీక్ష ఫలితాలను ఎస్‌యూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ శుక్రవారం విడుదల చేశారు. విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు తమ ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్ www.satavahana.ac.in మరియు https://stvuresults. a{ure-websites.netలో చూసుకోవచ్చునని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జాస్తి రవికుమార్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి సురేష్ కుమార్, అడిషనల్ కంట్రోలర్ డాక్టర్ అబ్రరుల్ బాకి, అసిస్టెంట్ రిజిస్టర్ వై. కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ కళాశాలను సందర్శించిన శాతవాహన వైస్ చాన్స్‌లర్

రామగిరి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శాతవాహన వైస్ చాన్స్‌లర్ ఉమేష్ కుమార్ శుక్రవారం మంథని జేఎన్‌టీయూ ఇంజినీ రింగ్ కళాశాలను సందర్శించారు. శాతవాహన యూనివర్శిటీకి అను బంధంగా హుస్నాబాద్‌లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇంజినీరింగ్ కళాశాల ఆరంభం అవుతున్న నేపథ్యంలో మంథని ఇంజినీరింగ్ కళాశాలలో ఉన్న వసతులను పరిశీలించారు. కళాశాలలోని అకాడమీ బ్లాక్‌తో పాటు ల్యాబ్‌లు, లైబ్రరీ, తరగతి గదులను, హాస్టల్‌ను పరిశీలించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్‌తో సమావేశమై సిలబస్, అడ్మిషన్ల ప్రక్రియపై చర్చించారు. రిజిష్ట్రార్ రవికుమార్, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ సురేష్, ప్రొఫెసర్ చెరుకు శ్రీధర్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ కృష్ణారెడ్డి ఉన్నారు.

కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోయాలి

మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బీ వినోద్ కుమార్, పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

కరీంనగర్ అర్బన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కన్నెపల్లి పంపుహౌస్ మోటార్లను వెంటనే ఆన్‌చేసి నీటిని ఎత్తిపోయాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం కరీంనగర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మంచిపేరు వస్తుందన్న అక్కసుతో కన్నెపల్లి పంపుహౌస్ నుంచి నీటిని ఎత్తిపోయకుండా లక్షలాది మంది రైతుల ఉసురు పోసుకోవడం ఎంత వరకు సమంజసమన్నారు. దీనిపై సర్కారు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఎల్లంపల్లి, మధ్యమానేరు, దిగువమానేరు జలాశయాలు, చెరువులు వెలవెలబోతున్నాయన్నారు. ఈ ప్రాజెక్టుల నుంచి త్వరలోనే మంచి నీరు సరఫరా చేయలేని దుస్థితి ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. కానీ మేడిగడ్డ బరాజ్ వద్ద 82 వేల పైచిలుకు క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహించి సముద్రం పాలవుతుందన్నారు. మేడిగడ్డ బరాజ్‌తో ఎటువంటి సంబంధం లేకుండా కన్నెపల్లి పంపుహౌస్ నుంచి నీటిని ఎత్తిపోయడానికి అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో మేడిగడ్డ బరాజ్‌తో సంబంధం లేకుండానే కన్నెపల్లి పంపుహౌస్ నుంచి రోజుకు 20 వేలపై చిలుకు క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసు కునే అవకాశం ఉందన్నారు.

కన్నెపల్లి పంపుహౌస్ నుంచి అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులకు ఎత్తిపోయడానికి నేషనల్ డ్యాం సెఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) ఎక్కడ అభ్యంతరం తెలుపలేదని గుర్తుచేశారు. ఎస్సారెస్పీ పునర్జీవం ద్వారా వరదకాలువను నిండుగా నింపుకోవడంతో పాటుగా ఈ పరిధిలోని అన్ని చెరువులను నింపడానికి పుష్కలమైన అవకాశాలున్నాయని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని పదే పదే చెపుతున్న రేవంత్ సర్కారు మాత్రం కక్ష పూరితంగానే వ్యవహరిస్తోందన్నారు. కన్నెపల్లి పంపుహౌస్ నుంచి నీటిని ఎత్తిపోస్తే కేసీఆర్‌కు మంచి పేరు వస్తుం దన్న అక్కసుతోనే కాంగెస్ ప్రభుత్వం నీటిని ఎత్తిపోయడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటిని ఎత్తిపోసే విషయంలో కాంగ్రెస్ సర్కారు ముఖ్యంగా సీఎం రేవంత్‌రెడ్డి, భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చూపుతున్న వివక్ష, నిర్లక్ష్యం వల్ల లక్షలాది మంది రైతుల జీవితాలు ఆగమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు.

ప్రస్తుతం నార్లు ముదిరి పోతున్నాయని, ఈ సమయంలో నాట్లు వేసుకోవడానికి ఒక్కసారి సాగునీరు అందిస్తే రైతులకు అండగా నిలిచినట్లు అవుతుందన్నారు. మేడిగడ్డ బరాజ్‌ను యాజమాన్యమే రిపేర్ చేసుకోవాలని ఎన్‌డీఎస్‌ఏ ఇప్పటికే స్పష్టంగా చెప్పిందన్నారు. ఇప్పటికైనా కక్షలు మానుకొని రైతు సంక్షేమం కోసం కన్నెపల్లి పంపుహౌస్ నుంచి నీటిని ఎత్తిపోసి నార్లు వేసుకోవడానికి ప్రభుత్వం సహకరించాలని విజ్ఞప్తిచేశారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, సిరిసిల్ల జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్లు ఏనుగు రవీందర్‌రెడ్డి, పొన్నం అనిల్, ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ రమణారావు, రాజేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి అమ్మవారికి సారె..



పట్టువస్త్రాలతో ఆలయానికి వస్తున్న మహిళలు

వేములవాడ కల్చరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరి అమ్మవారికి శ్రీవల్లి సేవా సంస్థకు చెందిన సుమారు 200 మంది సభ్యులు శుక్రవారం కన్నుల పండువగా సారె సమర్పించారు. తిప్పాపూర్ బస్టాండు నుంచి అమ్మవారికి పట్టు వస్త్రాలు, పసుపు, కుకుమ, పూలు, పండ్లు, స్వీట్లతో ఊరేగింపుగా రాజన్న ఆలయానికి తరలి వచ్చారు. ముందుగా శ్రీలక్ష్మీ గణపతికి రాజరాజేశ్వర స్వామి వారికి పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలను అందజేశారు. అనంతరం రాజరాజేశ్వరి అమ్మ వారికి పట్టు వస్త్రాలు, పసుపు, కుంకు మ, పూలు, పండ్లు, స్వీట్లను అంద జేశారు. పాడి పంటలు, పిల్లపాపలు చల్లంగా ఉండేలా దీవించాలని అమ్మ వారిని వేడుకున్నట్లు సంస్థ ఫౌండర్ మల్లెబోయిన పుష్పలత తెలిపారు.



అమ్మవారికి సమర్పించిన పట్టువస్త్రాలు, పూలు, పండ్లు

క్రీడల జిల్లాగా ఖ్యాతి సాధించాలి

రాజన్న సిరిసిల్ల జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్



హరీష్‌ను సన్మానిస్తున్న డీవైఎస్‌వో, క్రీడాకారులు

సిరిసిల్ల టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా క్రీడల జిల్లాగా ఖ్యాతిని సాధించాలని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్ అన్నారు. జిల్లాలోని కోనరావుపేట మండలం నాగారంనకు చెందిన బుర్రవేణి హరీష్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ (ఎన్ఐఎస్)లో ఆర్చరీ విభాగంలో సీటు సాధించగా శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో హరీష్‌ను జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చెన్నమనేని శ్రీకుమార్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాలీబాల అకాడమీ కోచ్ గుర్రం సంపత్‌గౌడ్, ఎం జగన్మోహన్, కబడ్డీ కోచ్ ప్రశాంత్, వాలీబాల్ అకాడమీ విద్యార్థులు పాల్గొన్నారు.

డీపీవో కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా

భగత్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో నమోదు లేని కార్మికుల పేర్లను వెంటనే నమోదు చేయాలని, పెండింగ్ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) నాయకులు శుక్రవారం కరీంనగర్‌లో డీపీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఎలుకపెల్లి సారయ్య, జిల్లా సహాయ కార్యదర్శి వడ్లూరి లక్ష్మీనారాయణ, కార్మికులు పర్లపల్లి రమేష్, కండె మధునయ్య, లక్ష్మీ, సరోజన, అవినాష్, నితిన్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలి

టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కిని నరసింహులు



సమావేశంలో మాట్లాడుతున్న బక్కిని నరసింహులు

కరీంనగర్ టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బక్కిని నరసింహులు, జాతీయ అధికార ప్రతినిధి, టీటీడీ బోర్డు సభ్యుడు, కరీంనగర్ పార్లమెంట్ పరిశీలకులు నన్నూరి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కమిటీలు పూర్తిచేసి గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తూ పార్టీకి పూర్వ వైభవం తీసుకు రావాలని అన్నారు. గ్రామాల్లో టీడీపీకి మంచి ఆదరణ ఉందన్నారు. పార్టీ తరపున పోటీచేసే అభ్యర్థులు వ్యక్తిగత ఓటు బ్యాంకు కలిగి ఉంటే ఎన్నికల్లో గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీ కార్యకర్తలు సమన్వయంతో కలిసి పనిచేయాలని, పార్టీ శ్రేణులు ఎన్నికల్లో కసితో పనిచేసి టీడీపీ సత్తాచాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ గొల్లపల్లి ఆనంద్, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ వెంకటేశ్ గౌడ్, పార్లమెంట్ అడ్‌హక్ కమిటీ సభ్యులు కళ్యాడపు ఆగయ్య, దామెర సత్యం, ఆవునూరు దయాకర్‌రావు, బత్తుల శ్రీనివాస్, మచ్చ ఆంజనేయులు, నాగుల బాలాగౌడ్, తీగుట్ల రమేష్ కుమార్, రొడ్డ శ్రీనివాస్, రొడ్డ శ్రీధర్, లంక భాస్కరశర్మ, తాటికొండ శంకర్, ఆకుల కాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు బందోబస్తు మధ్య భవనాల కూల్చివేతలు



వేములవాడలో భవనాల కూల్చివేత వద్ద మోహరించిన పోలీసులు

వేములవాడ టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ బస్టాండు నుంచి రాజన్న ఆలయం వరకు చేపడు తున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా భవనాల కూల్చివేతలు కొన సాగుతున్నాయి. మొత్తం 243 భవనాలు తొలగించేందుకు నిర్వాసితులను గుర్తించారు. అయితే 88 మంది హైకోర్టును ఆశ్రయించి స్టే తీసుకువచ్చారు. మిగతా ఇళ్లను గతనెల 16వ తేదీన పోలీసు బందోబస్తు మధ్య తొలగించారు. 88 మందికి కోర్టు స్టే ముగియడంతో శుక్రవారం ఆయా భవనాల కూల్చివేత ప్రారంభించారు. మరో 6 మంది నిర్వాసితుల స్టే గడువు సైతం ఈనెల 23వ వరకు ఉందని స్థానిక నిర్వాసితులు తెలిపారు. రాజన్న ఆలయం ముందు శుక్రవారం భారీగా పోలీసులు, అధికారులు చేరుకున్నారు.

కూల్చివేతలను పరిశీలించిన కలెక్టర్..

వేములవాడ పట్టణంలోని చేపడుతున్న కూల్చివేతలను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా శుక్రవారం పరిశీలించారు. రాజన్న ఆలయం ముందు భాగంలో పనులు కొనసాగుతుండగా క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. వెంట ఆర్డీవో రాధాబాయి, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, తహసీల్దార్ ఉన్నారు.

ఖేలో ఇండియా జూడో సెంటర్ పరిశీలన



క్రీడా పాఠశాల ఖేలో ఇండియా జూడో సెంటర్ విద్యార్థులతో సాయ్ డిప్యూటీ డైరెక్టర్ ప్రదీప్‌కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలలోని ఖేలో ఇండియా జూడో సెంటర్‌ను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(సాయ్)డిప్యూటీ డైరెక్టర్ ప్రదీప్ కుమార్ జిమ్నాస్టిక్ కోచ్ చంద్రశేఖర్‌రావుతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఖేలో ఇండియాలోని వివిధ విభాగాలను పరిశీలించారు. విద్యార్థుల గురించి, వారి ఖర్చుల గూర్చి, కోచ్ జీతభత్యాల గురించి అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సంతృప్తి వ్యక్తం చేసిన వారు ఖేలో ఇండియా జూడో సెంటర్ క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో వి శ్రీనివాస్‌గౌడ్, ఖేలో ఇండియా కోచ్ కే శ్యామ్, ప్రాంతీయ క్రీడాపాఠశాల కోచ్‌లు ఇందిర, విక్రమ్, సాయి, కిష్టయ్య, పవన్, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు రాయితీ రుణాలు



దరఖాస్తుకు ఈనెల 31 వరకు గడువు

కరీంనగర్ రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఆర్థిక భరోసా కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం, మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ నిర్ణయించింది. ఇతరుల మాదిరిగానే దివ్యాంగులు సాధారణ జీవనం గడపడమే ప్రధాన లక్ష్యంగా వ్యవసాయం, అనుబంధ పరిశ్రమలు, వ్యాపారం వంటివి చేసుకునేలా దివ్యాంగుల ఉపాధి, ఉనరావాస పథకం అమల్లోకి తీసుకువచ్చింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే దరఖాస్తుల స్వీరణ ఆన్‌లైన్ విధానంలో ప్రారంభించారు. లబ్ధిదారులు ఈ నెల 31 తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉన్నది. tgomms.cgg.gov.in వెబ్‌సైట్‌లో ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవచ్చు. కరీంనగర్ రూరల్ మండలంలో ఇప్పటికే ఇరుకుల్ల గ్రామానికి చెందిన దివ్యాంగునికి 50వేల రుణం బ్యాంక్ లింకేజీ ద్వారా అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ధ్రువపతారలతో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు గ్రామీణ ప్రాంతం వారికి ఎంపీడీవో, పట్టణవాసులకు మున్సిపల్ కమిషనర్ లాగిన్‌లోకి వెళ్తాయి. వాటిని మండల స్థాయిలో ఎంపీడీవో, సీడీపీఓ, ఏపీఎంతో ఏర్పాటు చేసిన కమిటీ ఆధ్వర్యంలో ఎంపిక చేస్తారు. ఇందులో మహిళలకు 33 శాతం అవకాశం ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.

అర్హులు ఎవరంటే..

కనీస దివ్యాంగత్వం 40శాతం పైన ఉండాలి. సదరం సర్టిఫికెట్ కలిగి ఉండాలి. వయస్సు 21-55 సంవత్సరాలలోపు ఉండాలి. ఆదాయ పరిమితి 1లక్ష 50వేలు (గ్రామీణ ప్రాంతాల వారికి) ఉండాలి. అయిదేళ్లలో దివ్యాంగుల సంక్షేమ శాఖ, ఇతర శాఖ, ఏదైనా ప్రభుత్వ సంస్థ నుంచి రాయితీ పొంది ఉండకూడదు.

బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నం ప్రకాష్

గణేశ్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బీసీలను, హిందూవులను అనాది కాలం నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తూనే ఉందని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్ అన్నారు. శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతున్నామని చెప్తూనే బీసీ-ఈ కేటగిరిలో ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్ ఇవ్వడం సరికాదన్నారు. మత ప్రాతిపదికన రిజర్వేషన్లు పక్కకు పెట్టి జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లను కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకలు పెంట శ్రీనివాస్, శానకొండ వాసు, మంతెన కిరణ్, మాదాసు సంజీవ్, నారోజు రాకేష్ చారి, మంద వెంకన్న, గుడిసెల రమేష్ గౌడ్, అజయ్, గుంపట మురళి తదితరులు పాల్గొన్నారు.

పంచాయితీలపై పోలీసుల నజర్

(5వ పేజీ తరువాయి)

ఈ ఘటన చోటు చేసుకున్న మరుసటి రోజు నుంచి పోలీస్ యంత్రాంగం పంచాయితీలపై నజర్ పెట్టింది. అలాంటి ఘటనలు జరగకుండా ఉండేందుకు బహిరంగ ప్రదేశాల్లో పంచాయితీలు నిర్వహించే వారిపై చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఆయా పట్టణాలు, మండలాల్లో ఎక్కడెక్కడ ఎక్కువగా పంచాయితీలు నిర్వహిస్తారో ఆ స్థలాలు, అడ్డాలను గుర్తిస్తున్నారు. అటు వైపుగా బ్లూ కోట్ పార్టీ పోలీసులు వెళుతూ ఆరా తీస్తున్నారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే పిటిషన్లను సత్వరమే పరిష్కరించాలని, ఫిర్యాదులపై విచారణ జరిపి కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపించాలని పోలీసు ఉన్నతాధికారులు కింది స్థాయి అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న పిటిషన్లకు సంబంధించి పిటిషనర్లను పిలిపించి సత్వరమే పరిష్కరించాలని పోలీసు ఉన్నతాధికారులు ఆదేశించారు.

ఖని సీనియర్ సివిల్ కోర్టు ఏపీపీగా పద్మజ



పద్మజకు నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, జూలై 18(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని సీనియర్ సివిల్ కోర్టు ఏపీపీగా న్యాయవాది చెలుకల పద్మజను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు అందించింది. ప్రభుత్వం తరపున కోర్టులో క్రిమినల్ కేసులను వాదించనున్నారు. శుక్రవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ చేతుల మీదుగా నియామక పత్రాలను అందుకున్నారు. తన నియామకానికి కృషి చేసిన మంత్రి శ్రీధర్‌బాబుకు, ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్, పీసీసీ కార్యదర్శి పెద్దెల్లి తేజస్విని, ప్రకాష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఏపీపీగా బాధ్యతలను స్వీకరించిన పద్మజను న్యాయవాదులు పెద్దెల్లి ప్రకాష్, మార్కపురి తిలక్, వరలక్ష్మి అభినందించారు.

అప్రూవల్ రాదు.. పర్మిషన్ లేదు...

- మండల కేంద్రంలోని వెంచర్‌లో అడ్డగోలుగా నిర్మాణాలు
- చోద్యం చూస్తున్న అధికారులు - ఒకే మీటర్‌తో అన్ని ఇళ్లకు కనెక్షన్



వెంచర్‌లో నిర్మిస్తున్న బహుళ అంతస్తుల నిర్మాణాలు

ధర్మారం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఓ వెంచర్‌ను ఏర్పాటుచేశారు. వెంచర్ ప్రారంభించి మూడేళ్ళు దాటినా డీటీపీసీ నుంచి అప్రూవల్ రాలేదు. ఇంటి నిర్మాణాలకు గ్రామ పంచాయతీ పర్మిషన్ లేకున్నా మూడంతస్తుల భవనాలు కట్టేస్తున్నారు. నిబంధనలు బేఖాతరు చేస్తూ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో మూడేళ్ళ క్రితం దాదాపు 6 ఎకరాల్లో 85 ప్లాట్లను ఏర్పాటు చేశారు. లేఔట్‌కు డీటీపీసీ (డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్) నుంచి అప్రూవల్ రాకున్నా ప్లాట్లు విక్రయించారు. ఈ వెంచర్‌లో 34 మంది ప్లాట్లను కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ప్లాట్లు కొనుగోలు చేసిన వారిలో కొందరు గ్రామ పంచాయతీ పర్మిషన్ లేకున్నా ఇండ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. మరి కొందరు మూడు, నాలుగు అంతస్థుల నిర్మాణాలు దర్జాగా చేపడుతున్నారు.

నిబంధనలు బేఖాతరు

నిబంధనలు పాటించకపోవడం వల్లే డీటీపీసీ అనుమతులు రావడం లేదని సమాచారం. లేఔట్ ఆధారంగా విద్యుత్ స్తంభాలు, వైర్లు, పరికరాల కోసం టిఎస్ ఎన్‌పిడీసీఎల్‌కు డీడీ రూపంలో డబ్బులు చెల్లించి కనెక్షన్ తీసుకోవాల్సి ఉంటుంది. వెంచర్‌లో నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు వ్యక్తులకు కాంట్రాక్ట్ ఇచ్చి స్తం భాలు, వైర్లు బిగించారు. వైరు 34 స్క్వైయర్ మిల్లీ మీట ర్ ఉండాల్సి ఉండగా ప్రైవేట్ వ్యక్తుల ద్వారా కొనుగోలు చేసిన వైరు తక్కువ సైజులో ఉంది. దీంతో ట్రాన్స్‌కో అధికారులు ఎన్‌ఓసి ఇవ్వలేదు. వెంచర్ నిర్మాణ సమ యంలో చీటి రామారావు పేరు మీద ఇచ్చిన మీటర్ (సర్వీస్ నంబర్ 6043) నుంచే దాదాపు 10 మంది కనె క్షన్‌ను తీసుకొని ప్రస్తుతం ఇంటి నిర్మాణాలు చేపడుతు న్నారు. ఇండ్లు పూర్తయిన వారు కూడా అదే మీటర్ నుంచి విద్యుత్ వాడుకుంటున్నారు. అయినప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. లేఔట్ అప్రూవల్ రావాలంటే ఇంటర్నల్ రోడ్లు 33 ఫీట్లు వేసినప్పటికి మేన్‌రోడ్డును ఆనుకుని ఉండే అప్రోచ్ రోడ్డు 40 ఫీట్లు వేయాల్సి ఉంటుంది. అప్రోచ్ రోడ్డును కూడా 33 ఫీట్లే వేశారు. పార్కు స్థలం లేఔట్ మధ్యలో అన్ని ప్లాట్లకు అనుకూలంగా ఉండాల్సి ఉండగా వెంచర్ చివరి భాగంలో గుట్ట పక్కన స్థలం వదిలి పెట్టారు.

పంచాయతీ పరిధిలో ఇల్లు నిర్మించుకోవాలంటే గ్రామ పంచాయతీ పర్మిషన్ తీసుకోవాల్సి ఉంటుంది రెండు సంవత్సరాలుగా మూడు, నాలుగు అంతస్థుల మేడలు నిర్మాణం చేపడుతున్నపటికి ఏ ఒక్క దానికి పర్మిషన్ లేదు.

గతంలో అడ్డుకుంటే ఒత్తిడి వచ్చింది

కె.రమేష్, ఎంపీవో, ధర్మారం



పర్మిషన్లు లేకుండా ఇండ్ల నిర్మాణం చేపట్టడం తప్పే. గతంలో ఇండ్లు నిర్మిస్తున్నారనే సమాచారంతో అడ్డుకున్నాను. అయితే ఇంటి నిర్మాణం చేపట్టిన వారు పైఅధికారులతోపాటు రాజకీయ నాయకులతో ఒత్తిడి చేయించారు. దాంతో నేను ఏమి చేయలేకపోయాను.

విద్యుత్ వైరు నాణ్యతగా లేదు

మహమ్మద్ ఖాసీం (ఏఈ టీఎస్ఎన్‌పిడీసీఎల్)



టీఎస్ఎన్‌పిడీసీఎల్ నిబంధనల ప్రకారం వైరు విషయంలో నాణ్యత పాటించలేదు. అందుకే మేము ఎన్‌ఓసి ఇవ్వలేదు. కొత్త విద్యుత్ పరికాల కోసం సంస్థకు డీడీ కట్టారు. కొత్త వైర్లు బిగించడం ట్రాన్స్‌ఫార్మర్స్ పనులు త్వరలోనే జరుగుతాయి.

అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

జ్యోతినగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తున్నదని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. శుక్రవారం 4వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం మాట్లాడారు. పేద ప్రజల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తున్నామన్నారు. నగరంలో 200 కోట్ల రూపాయలతో మౌలిక సౌకర్యాలను కల్పిస్తున్నామని తెలిపారు. విద్య, వైద్యం, కనీస సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో అన్ని డివిజన్లలో పనులు చేపట్టామన్నారు. అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ జె.అరుణశ్రీ, మాజీ కౌన్సిలర్లు, నాయకులు ఎం.డి.ఆసీఫ్ పాషా, భరత్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పీజీ కళాశాలలో కొత్త కోర్సులకు కృషి

కోల్‌సిటీటౌన్, (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పీజీ కళాశాలలో నూతన కోర్సుల ప్రారంభానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. పీజీ కళాశాలలో రూ.86.5 లక్షల నిధులతో ప్రహరి నిర్మాణ పనులను శాతవాహన యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వైస్‌ఛాన్సలర్ మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జాస్తి రవికుమార్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్‌కుమార్, ఇంజనీర్ ప్రకాష్‌రావు, కళాశాల ప్రిన్సిపల్ రమాకాంత్, పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

బీటీ రోడ్డు పనులు ప్రారంభం

గోదావరిఖని,(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవే రుస్తున్నామని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. బాపూజీనగర్‌లో పోచమ్మ ఆలయం వద్ద రూ.6కోట్ల సింగరేణి నిధులతో జీఎం కార్యాలయం నుంచి ఫైవింక్లయిన్ వరకు బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు బొంతల రాజేష్ మహంకాళి స్వామి, బాల రాజ్‌కుమార్, శివ, రాజిరెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

ప్రతీ నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు అందించడమే లక్ష్యం



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసిడింగ్‌లు అందిస్తున్న ఎమ్మెల్యే

పెద్దపల్లి రూరల్ , జూలై 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధికి పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. కాపులపల్లి, కనగర్తి గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టారు. అనంతరం ఆయా గ్రామాలకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలను అందజేశారు. స్థానిక నాయకులతో కలిసి ఇందిరమ్మ ఇళ్లకు ఎమ్మెల్యే ముగ్గులు పోసి, భూమి పూజ చేశారు. సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రతి గ్రామంలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు అందించి వారి కళ్ళల్లో ఆనందం చూసేందుకు కృషి చేస్తున్నామన్నారు. గ్రామాల్లో సిసి రోడ్లు, మురికి కాలువల నిర్మాణాలు చేపడుతున్నామని, కాపులపల్లి, కనగర్తి గ్రామాలలో ఇందిరమ్మ గృహాల మంజూరు, అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు అందిస్తున్నామని పేర్కొన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్, 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, రైతు భరోసాను ఇచ్చామన్నారు. సన్న వడ్లకు బోనస్ ఇచ్చినట్లు గుర్తు చేశారు. నియోజకవ ర్గంలో గతంలో ఇసుకను అమ్ముకున్న పాలకులు ఉన్నారని ప్రస్తుతం తాము అతి చౌకగా ఇసుక ను అందిస్తున్నామన్నారు. ఎంపీడీఓ కొప్పుల శ్రీనివాస్, ఎంపీవో ఫయాజ్, మాజీ ఎంపీటీసీ శంకరయ్య, పంచాయితీ కార్యదర్శులు పాష, సంధ్యారెడ్డి , కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

కోల్‌సిటీటౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో శుక్ర వారం మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన వచ్చింది. ఈ జాబ్‌మేళాలో హైదరాబాద్ నుంచి దాదాపు 10కి పైగా కంపెనీలు ఫ్లిప్‌కార్ట్, నెక్సా, క్వెస్‌కార్ప్, బిజెడ్ ఫిన సర్వీ సెస్ వంటి కంపెనీల హెచ్‌ఆర్ ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వమించారు. మేళాలో 200 మందిపైగా అభ్యర్థులు పాల్గొనగా 96 మంది అభ్యర్థులు ఎంపిక కాగా అర్హత పత్రాలను అందజేశారు. కాగా భవిష్యత్‌లో మరిన్ని అనేక కంపెనీలతో జాబ్ మేళాలను నిర్వహిస్తా మని కళాశాల ప్రిన్సిపాల్ జైకిషన్ ఓజా, ప్లేస్‌మెంట్ అధికారి సుబ్బారావు, టీఎస్‌కేసీ మెంటార్ ఉషారాణి తెలిపారు.

క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించాలి

సుల్తానాబాద్, జూలై 18(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలలో రాణించాలని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా డిప్యూటీ డైరక్టర్ ప్రదీప్‌కుమార్ అన్నారు. సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న ఖేలో ఇండియా ఖోఖో శిక్షణ శిబిరాన్ని శుక్రవారం సందర్శించారు. 2037లో ఒలింపిక్ క్రీడలు భారత్‌లో నిర్వహించనున్నారని, ఇప్పటి నుంచే క్రీడలపై ఆసక్తి గల వారికి శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణ కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు, బయోమెట్రిక్ విధానాన్ని ఏర్పాటు చేసుకోవాలని క్రీడల అభివృద్ధి అధికారి సురేష్‌కు సూచించారు. హాజరు రిజష్టర్లను పరిశీలించారు. పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల క్రీడల యువజన శాఖ అధికారులు సురేష్, శ్రీనివాస్, రాష్ట్ర స్థాయి అధికారి చంద్రకాంత్, ఎంఈవో రాజయ్య, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, పీడీ అంతటి శంకరయ్య, కుమార్ కిషోర్, కోచ్ గెల్లు మధూకర్ ఉన్నారు.

ఇండియన్ గ్యాస్ సిలిండర్ల తనిఖీ

జ్యోతినగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేషన్ పరిధిలో ఇండియన్ గ్యాస్ తనిఖీలు ఈనెల 26 నుంచి చేపడుతామని, వినియోగదారులు సహకరించాలని గ్యాస్ మేనేజర్ మధుసూదన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఐవోసీఎల్ సంస్థ ఇండేన్ గ్యాస్ కస్టమర్ల ఇంటింటి సర్వే చేస్తున్నారని తెలిపారు. శిక్షణ పొందిన టెక్నీషియన్లు కనెక్షన్లను పరిశీలిస్తారని, ఆధార్, ఈ కేవైసీ, ఓటీపీ నెంబరు చెప్పాలని కోరారు. సంస్థ బృందం 236 రూపాయల జీఎస్‌టీ రశీదు ఇస్తారని, దానికి భద్ర పర్చుకోవాలని సూచించారు.

ఇళ్ల మధ్య నిలుస్తున్న వర్షం నీరు

వ్యాధుల బారిన కాలనీవాసులు ● పట్టించుకోని అధికారులు, సిబ్బంది



మురుగు నీటితో నిండిన కాలనీ దారి

కాల్వశ్రీరాంపూర్, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెగడపల్లి గ్రామంలోని 2వ వార్డులో కొద్దిపాటి వర్షానికి నీరంతా నిండి పోతున్నది. దీంతో కాలనీ వాసులు రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ఆ కాలనీ లోతట్టుగా ఉండటంతో చుట్టు పక్కల కాలనీలోని వర్షపు నీరంతా రెండవ కాలనీ రోడ్లపై నిలిచి బురదమయంగా మారుతున్నది. కాలనీవాసులు ఆ నీటి నుంచే నడవాల్సిన దుస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురిసి వారం రోజులైనా నీటి నిల్వ అలాగే ఉండి దోమల స్వైర విహారంతో పలువురు అనారోగ్యం బారిన పడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం చిన్న పిల్లలు పలు రోగాల బారిన పడుతున్నట్లు తెలిపారు. అధికారులు, సిబ్బంది పారిశుద్యంపై పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే వర్షపు నీటితోపాటు మురుగు నీరు బయటకు తరలించేందుకు సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇబ్బంది తలెత్తుతోంది. ప్రస్తుతం పాలకవర్గం లేకపోవడంతో తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని దుస్థితి నెలకొందని కాలనీవా సులు వాపోయారు. అధికారులు స్పందించి నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.



టీబీజీకేఎస్ నాయకుల బదిలీలు

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 18(ఆంధ్రజ్యోతి): తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘానికి చెందిన నాయకులను సింగరేణి యాజమాన్యం శుక్రవారం బదిలీ చేసింది. ఆర్జీ-2 ఏరియా ఓసీపీ-3లో ఓవర్‌మెన్‌గా పని చేస్తున్న మాదాసు రామ్మూర్తిని మణుగూరుకు, ఆర్జీ-2 ఏరియా వర్క్ షాప్‌లో ఫిట్టర్‌గా పని చేస్తున్న బాలసాని కొంరయ్యను ఇల్లందుకు బదిలీ చేసింది. కాగా అనూహ్యంగా జరిగిన బదిలీలు రామగుండం రీజియన్‌లో చర్చనీయాంశమైంది.

నిరుద్యోగ యువతకు వోల్వో డంప్ ట్రక్ శిక్షణ

గోదావరిఖని, జూలై 18(ఆంధ్రజ్యోతి): హెవీ గూడ్స్ వెహికల్ (హెచ్‌జీవీ) డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉన్న నిరుద్యోగ యువకులకు ఉచితంగా వోల్వో డంప్ ట్రక్ శిక్షణ సింగరేణి యాజమాన్యం ద్వారా ఇవ్వడం జరుగుతుందని ఆర్‌జీ-1 ఏరియా అధికార ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. హెవీ గూడ్స్ వెహికల్ (హెచ్‌జీవీ) డ్రైవింగ్ లైసెన్స్, డ్రైవింగ్‌లో మూడేళ్ళ అనుభవం, ఎస్ఎస్‌సీ విద్యార్హత కలిగిన యువకులు అర్హులని, సింగరేణి వ్యాప్తంగా 60మందికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ నెల 21వ తేదీ నుండి ఆగస్టు 9వ తేదీ వరకు ఆర్‌జీ-1 ఏరియాలోని జీవీటీసీలో ప్రాథమిక శిక్షణ, ఆగస్టు 11వ తేదీ నుండి 23వ తేదీ వరకు ఆర్‌జీ-1 ఏరియాలో ప్రాక్టికల్ శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తిగల గోదావరిఖని, పరిసర ప్రాంత నిరుద్యోగ యువకులు ఈ నెల 20వ తేదీ లోపు ఆర్‌జీ-1ఏరియా జీవీటీసీలో సంప్రదించాలని సూచించారు.

గైర్హాజరైన ఉద్యోగులకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్‌లో మాట్లాడుతున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని, జూలై 18(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఆర్‌సీఓఏ క్లబ్‌లో ఆర్‌జీ-1 ఏరియా గనులు, డిపార్ట్‌మెంట్లకు సంబంధించిన 378 మంది గైర్హాజరు ఉద్యోగులకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్‌కు 109మంది హాజరయ్యారు. ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్, సేవా అధ్యక్షురాలు అనిత లలిత్ కుమార్ హాజరై గైర్హాజరైన ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. జీఎం మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో ఉద్యోగం ఆవశ్యకత గురించి తెలిపారు. అనారోగ్య సమస్యలు తలెత్తితే సింగరేణి ఆసుపత్రిలో వైద్యం చేయించుకోవాలని, దీని వలన ఉద్యోగం కాపాడుకున్నవారవుతారని తెలిపారు. ఉద్యోగులు విధులకు హాజరై నిర్దేశిత మస్టర్లను పూర్తి చేయాలని, 3సంవత్సరాల గైర్హాజరు మస్టర్లను పరిగణలోకి తీసుకొని విధుల నుంచి తొలగిస్తామన్నారు. ఉద్యోగులు మరే ఇతర సమస్యలైనా పరిష్కరించడానికి యాజమాన్యం తోడ్పాటునందిస్తుందని పేర్కొన్నారు. గైర్హాజర్ ఉద్యోగుల సమస్యలను తెలు సుకొని పరిష్కారమార్గం చూపించారు. 2024లో 100 మస్టర్లు నిండని ఉద్యోగులకు, ఈ సంవత్సరం 50మస్టర్లు నిండని వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్ఓటు జీఎం ఆంజనేయప్రసాద్, ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎల్లయ్య, సీఎంఓఏఐ వైస్ ప్రసిడెంట్ శ్రీనివాస్, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, డాక్టర్ స్రవంతి, డిప్యూటి పర్సనల్ మేనేజర్ వేణు, పాల్గొన్నారు.

పెండింగ్ ప్రమోషన్లు బ్యాక్ డేట్‌తో ఇవ్వాలి

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 18(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఈపీ ఆపరేటర్ల ప్రమోషన్లను బ్యాక్ డేట్‌తో ఇవ్వాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం ఓసీపీ-3 మేనేజర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఆర్జీ-2 బ్రాంచి సెక్రెటరీ కుంట ప్రవీణ్ మాట్లాడారు. బొగ్గు ఉత్పత్తిలో కీలక పాత్ర ఈపీ ఆపరేటర్లదని పేర్కొన్నారు. కొందరు ఆపరేటర్లకు ఆరు సంవత్సరాలుగా ప్రమోషన్లు రాలేదని తెలిపారు. సకాలంలో ప్రమోషన్లు ఇవ్వని కారణంగా ఆర్థికంగా నష్టపోవడంతోపాటు మానిసక క్షోభకు గురవుతున్నారని తెలిపారు. బ్యాక్ డేట్‌తో ఏరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అసిస్టెంట్ పిట్ సెక్రెటరీ వినేష్, నాయకులు శివకుమార్, సంతోష్, తిరుపతి, రాజేందర్ ఉన్నారు.

సీఎంపీఎఫ్ అధికారులతో బీఎంఎస్ సమావేశం

గోదావరిఖని, జూలై 18(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలోని సీఎంపీఎఫ్ ఆఫీస్‌లో కమిషనర్ శ్రీహరి పచౌరి, సీఎంపీఎఫ్ సిబ్బందితో బీఎంఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం పెన్షనర్లు, కార్మికుల సమస్యలపై చర్చించారు. సింగరేణి యాజమాన్యం సీఎంపీఎఫ్ పంపించిన రిటైర్డ్ కార్మికుల రివైజ్డ్ పెన్షన్ ఆర్డర్లపై 18వేల దరఖాస్తులు రాగా 1169 పూర్తి చేసామని మిగిలిన దరఖాస్తులన్నింటిని త్వరలో క్లియర్ చేస్తామన్నారు. స్టాఫ్ తక్కువగా ఉండటం వలన ఆలస్యమవుతుందని తెలిపారు. సీ-కేర్స్ ఆన్‌లైన్ పోర్టల్ గురించి కార్మికులకు పూర్తి అవగాహన కల్పించాలని కోరగా కార్యాచరణకు ఆదేశాలు జారీ చేశారన్నారు. పులి రాజారెడ్డి, రమాకాంత్, రవీందర్‌రావు, టీఎస్ పవన్ కుమార్, కనకమ్మ, పాల్గొన్నారు.

ట్రినిటి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



బెంగళూరులో బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

పెద్దపల్లి కల్చరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): బెంగుళూరులోని ఐఐఎస్సీ, ఐఐటీ బాంబే సంయుక్తంగా నిర్వహించిన కోడేబోట్ హ్యాకథాన్ గ్రాండ్ ఫైనల్‌లో ట్రినిటి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు దేశ వ్యాప్తంగా రెండో బహుమతి సాధించారు. మొదటి దశలో 64 జట్లు పాల్గొనగా ట్రినిటి నుండి 14 జట్లు ఎంపికయ్యాయి. చివరి దశలో ఆరు జట్లు పాల్గొని సృజనాత్మకతను, సామాజిక బాధ్యతను చూపుతూ వినూత్న పరిష్కారాలను ప్రతిపాదించాయని కళాశాల ప్రిన్సిపాల్ మణి గణేష్, డైరెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. గోల్డ్ టైటాన్స్ జట్టు సభ్యులు సయ్యద్ మహిజబీన్, గోదారి వైష్ణవి, రాహుల్, బండారిలు అటిజం పిల్లలకు ఉపయోగపడే విజువల్ ఫ్రెండ్లీ మెడికేషన్ మేనేజ్‌మెంట్ సిస్టం రూపొందించి రెండో బహుమతి సాధించి, రూ.50 వేల నగదు బహుమతి పొందారు. మిగతా జట్లు గ్రామీణ రైతులకు తెలుగు వాయిస్ అసిస్టెంట్, ఆరోగ్య కార్యకర్తకు హెల్త్ పీడబ్ల్యుఏ, ఔషధాలపై అవగాహన కలిగించే షెడ్యూలర్ ఐడియాలను ప్రతిపాదించి ప్రశంసలు పొందారు. కళాశాల వ్యవస్థాపకులు దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ ప్రశాంత్ రెడ్డి, సమ్మయ్య విద్యార్థులను, వారి తల్లితండ్రులను అభినందించారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నోట్‌బుక్‌ల పంపిణీ

సుల్తానాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పూసాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు లయన్స్ క్లబ్ వారు నోట్స్ బుక్కులను పంపిణీ చేశారు. శుక్రవారం స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పదో తరగతికి చెందిన విద్యార్థులకు అవసరమున్న నోటు బుక్కులు పాఠ్య పుస్తకాలు అందించినట్లు సుల్తానాబాద్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జూపల్లి తిరుమల్ రావు తెలిపారు. వల్స నీలయ్య, మాటేటి శ్రీనివాస్, సాంబమూర్తి, సుధీర్ రావు, హెచ్‌ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

పాలకుర్తి, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని జయ్యారం గ్రామ ప్రభుత్వ బాలుర సాంఘిక సక్షేమ వసతి గృహంలో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం ప్రభుత్వం అందించిన స్టడీ మెటీరియల్,నోటు పుస్తకాలు,బ్యాగ్స్,షూస్ లను సంక్షేమ అధికారి మెండె సంపత్ కుమార్ విద్యార్థులకు పంపిణీ చేశారు.

మిట్టపల్లి ప్రవీణ్ బీజేపీ జిల్లా కన్వీనర్ కాదు

సుల్తానాబాద్, జూలై 18. (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణానికి చెందిన మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ బీజేపీ జిల్లా కన్వీనర్ కాదని జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీరెడ్డి అన్నారు. ఇటీవల ప్రవీణ్ బీజేపీ జిల్లా కన్వీనర్‌గా చెలామణీ పేర్కొంటున్నాడని, కన్వీనర్ నియామకం జిల్లా కమిటీలో జరగలేదని స్పష్టం చేశారు. గురుపౌర్ణమి సందర్భంగా రిటైర్డు ప్రభుత్వ ఉపాధ్యాయులను సన్మానించే కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు మాత్రమే కార్యక్రమ కన్వీనర్ గా ఉన్నారన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

కమాన్‌పూర్, జూలై 18(ఆంధ్రజ్యోతి): కమాన్‌పూర్ మండల గ్రామపంచాయతీ కార్యాలయంలో కారోబార్లతో మండల ప్రత్యేక అధికారి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని సూచించారు. అలాగే సకాలంలో పన్నులు వసూలు చేసి గ్రామపంచాయతీ అభివృద్ధికి సహకరించాలని తెలిపారు. వసూలు చేసిన ఇంటి పన్నులను సంబంధిత ఎస్‌టీఓలో జమ చేయాలని పేర్కొన్నారు. రసీదులను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చూపాలన్నారు. కారోబార్లు బర్ల భూమయ్య, నరేష్, మంగ సంతోష్, సతీష్, సాకేత్, శంకరయ్య, రమేష్‌లు తదితరులు పాల్గొన్నారు.

రేపు చదరంగం పోటీలు

కాల్వశ్రీరాంపూర్, జూలై 18(ఆంధ్రజ్యోతి): జిల్లా చదరంగ సమైక్య ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ డే చెస్ సందర్భంగా ఈ నెల 20న నూగురు నింబయ్య స్మారక చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చదరంగ సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, బాను విజయనంద్ తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు జిల్లా కేంద్రంలోని గాయత్రి విద్యానికేతన్ స్కూల్, సిరి ఫంక్షన్ హాల్‌లో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. చదరంగ పావులు, చెస్ బోర్డు క్రీడాకారులు వెంట తెచ్చుకోవాలన్నారు. పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు అందజేస్తామని నూగురు మహేందర్ తెలిపారు.

రామగుండం ఎంఈవోగా మల్లేశం

కోల్‌సిటీటౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): రామగుండం మండల విద్యాధికారిగా జింక మల్లేశం శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గోదావరిఖని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న మల్లేశంకు ఎంఈవోగా బాధ్యతలు అప్పగించారు. జింక మల్లేశంను ట్రస్మా నాయకులు శుక్రవారం కలిసి సత్కరించారు. బండారపు యాదగిరిగౌడ్, అంజారెడ్డి, కంది రవీందర్‌రెడ్డి, చందుపట్ల తిరుపతిరెడ్డి, అదర్‌సండే సమ్మారావు, కొత్త శ్రీనివాస్‌రెడ్డి, లక్కాకుల రవి, చాంద్‌పాషా, సీతారామాచార్య, వెంకటేశ్వరరావు, జి.సునిత పాల్గొన్నారు.

జ్యోతినగర్, (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎంఈవోగా నియమితులైన జింక మల్లేశంను శుక్రవారం ఎన్టీపీసీ టీటీఎస్ జెడ్పీ పాఠశాలలో సన్మానించారు. పాఠశాలలో ఎఫ్‌ఆర్ఎస్‌లో భాగంగా వచ్చిన ఎంఈ వోను ఉపాధ్యాయులు సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు జయరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జనరల్ ఆసుపత్రిలో అభివృద్ధి పనులకు శ్రీకారం

కళ్యాణ్‌నగర్, జూలై 18(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వివిధ అభివృద్ధి పనులకు కలెక్టర్ కోయ శ్రీహర్ష నిధులు మంజూరు చేశారు. పాత బిల్డింగ్, క్రిటికల్ కేర్ మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలో కొత్తగా నాలుగు ఓపీ బ్లాకులను నిర్మిస్తున్నట్లు ఆర్ఎంఓ రాజు తెలిపారు. మందుల స్టోరేజీ రూమ్‌లో ర్యాక్‌ల కొరత ఉండడంతో మరిన్ని ర్యాక్‌లను తీసుకువచ్చినట్లు, రోగులు కూర్చునేందుకు ఆసుపత్రి లోపల స్టీల్ కుర్చీలను ఏర్పాటు చేసినట్లు, ఆసుపత్రి వెనుక భాగంలో రోగుల అటెండర్లు కూర్చోవడానికి బెంచీలతోపాటు త్వరలో షడ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఆసుపత్రి ఆవరణలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులతోపాటు మార్చురీ గదులకు పెయింటింగ్‌ను ఆయన పేర్కొన్నారు.

ఖనిలో ఉచిత కంటి వైద్య శిబిరం



శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కోల్‌సిటీటౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): రేకుర్తి కంటి ఆసుపత్రి సౌజన్యంతో లయన్స్ క్లబ్ గోదావరిఖని ఆధ్వర్యంలో శుక్రవారం అడ్డగుంటపల్లి ఆర్యవైశ్య భవన్‌లో ఉచిత కంటి ఆపరేషన్ శిబిరం నిర్వహించారు. శిబిరంలో సుమారు 102మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి 42మందిని ఆపరేషన్ నిమిత్తం రేకుర్తి కంటి ఆసుపత్రికి బస్సులో తీసుకువెళ్లారు. లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ కజాంపురం రాజేందర్, జోన్ చైర్మన్ నార్ల ప్రసాద్, అధ్యక్షుడు చంద్రగుప్త, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, కోశాధికారి ఎన్ సత్యప్రసాద్‌తో పాటు లయన్స్ క్లబ్ గోదావరిఖని స్ఫూర్తి అధ్యక్షుడు మామిడిపల్లి శ్రీధర్, కోదాటి ప్రవీణ్, గోపాలరావు పాల్గొన్నారు.